# రైతుపై తూటా

చందంపేట, మేజర్‌న్యూస్ ః రైతాంగ ఆత్మహత్యలు నివారిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీలిచ్చి కేంద్రంలోను, మధ్యప్రదేశ్‌లోను అందలమెక్కిన బీజేపీ ప్రభుత్వాలు అన్నదాతలపైనే తుపాకీ ఎక్కుపెట్టడం హేయమైన చర్య. ఒకవైపు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ మరో వైపు రైతులను పిట్టలను కాల్చినట్టు కాల్చిపడేసిన పాలకుల కిరాతకాన్ని ఎంత ఖండించినా తక్కువే. మధ్యప్రదేశ్‌లో రైతులు తాము పండించిన పంటకు మద్దతు ధర కావాలని అడిగారు. ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాత్రమే వారు కోరారు. రైతులపైకి పోలీసులను ఉసిగొల్పి ఆరుగురిని పొట్టనబెట్టుకోవడం దుర్మార్గం. సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ ప్రభుత్వమైనా నిర్వర్తించాల్సిన కనీస బాధ్యత. దీనిని విస్మరించి నిరంకుశంగా అణచివేయాలని చూడడం అప్రజాస్వామికం. మధ్యప్రదేశ్‌లో మొదట ఒక జిల్లాలో ప్రారంభమైన రైతుల ఆందోళన క్రమంగా రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాలకు విస్తరించింది. మందసోర్, పిప్లియామండీ ప్రాంతాల్లో ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి రైతుల పోరాటాన్ని అణచివేయాలని చూసింది. ఈ పాపంలో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వానికీ వాటా వుంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేండ్లు గడిచినా రైతాంగాన్ని ఆదుకునేందుకు ఎలాంటి చర్య తీసుకోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. నయా ఉదారవాద విధానాలతో ఇప్పటికే సంక్షుభితంగా మారిన వ్యవసాయరంగం మోడీ ప్రభుత్వ నిర్వాకం వల్ల మరింత తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడింది. మధ్యప్రదేశ్‌లో కాల్పులు దీనికి పరాకాష్ట. కేవలం ఒక్క మధ్యప్రదేశ్‌లోనే కాదు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోను, దాని మిత్రపక్షాలు అధికారంలో వున్న రాష్ట్రాల్లోను రైతు వ్యతిరేక విధానాలు ఉధృతంగా అమలవుతున్నాయి. మొత్తం రైతు ఆత్మహత్యల్లో 60శాతం దాకా ఈ రాష్ట్రాల్లోనే చోటు చేసుకున్నాయని అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. మొదట గుజరాత్ రైతాంగం వీధుల్లోకి వచ్చింది. నేడు మహారాష్ట్రలో రైతాంగ పోరాటాలు ఉధృతంగా సాగుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఈనాడు బీజేపీ ప్రభుత్వ విధానాలపై ఈ దేశ రైతాంగం తిరుగుబాటు చేస్తోంది. మధ్యప్రదేశ్‌లో రైతాంగ పోరాటం, మహారాష్ట్రలో రైతులు వారం రోజుల పాటు నిర్వహించిన సమ్మె, రాష్ట్ర బంద్ అసాధారణమైనది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అనే కాదు, మిగతా రాష్ట్రాల్లోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై రైతాంగంలో ఆగ్రహం రగుల్కొంటోంది. చత్తీస్‌ఘడ్, హర్యానా, జార్ఖండ్‌ల్లో రైతాంగ పోరాటాలు సాగుతున్నాయి. రైతుల పోరాటానికి బాసటగా నిలవాలని సామాజిక కార్యకర్త అన్నా హజారేను రైతు సంఘాలు కోరగా ఆయన అందుకు నిరాకరించారు. ఇది ఆయన సంకుచిత ధోరణికి నిదర్శనం. ఎఐకెఎస్, ఇతర రైతు సంఘాల ఆధ్వర్యాన మహారాష్ట్ర రైతులు పట్టుదలతో పోరాడుతున్నారు. రైతులు తమ నిరసనలో భాగంగా వ్యవసాయోత్పత్తులను పట్టణాలకు సరఫరా చేయడానికి నిరాకరిస్తున్నారు. వాటిని రోడ్లపై పారబోస్తున్నారు. మహారాష్ట్రలోని ఫడ్నవీస్ ప్రభుత్వం రైతులతో చర్చించి సామరస్యంగా దీనిని పరిష్కరించుకోవడానికి బదులు ఈ ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం అవివేకం. తమిళనాడులో 140ఏండ్లలోనే అతి పెద్దకరువు గత సంవత్సరం చోటు చేసుకుంది. ఈ కరువు బారిన పడి ఇప్పటివరకు 400మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విపత్కర పరిస్థితినుంచి తమిళనాడును ఆదుకునేందుకు 40వేల కోట్ల ప్యాకేజీ కావాలని తమిళనాడు రైతులు నలభై రోజులకుపైగా ఆందోళన నిర్వహించారు. రాజధాని ఢిల్లీలో దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. రైతులు ఎంత ఘోషించినా రుణమాఫీ చేసే ప్రసక్తే లేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెగేసి చెప్పారు. కరువుతో అల్లాడుతున్న తమిళనాడుకు ఇంతవరకు పైసా కూడా సాయం చేయలేదు. పైగా సుప్రీం కోర్టులో దీనిపై కేంద్రం తన వాదన వినిపిస్తూ తమిళనాడులో రైతులెవరూ ఆత్మహత్య చేసుకోలేదని చెప్పింది. ఇది తమిళప్రజలతో క్రూర పరిహాసమాడటమే. రైతులను ఉద్ధరించేందుకే తెచ్చానని ఘనంగా చెప్పుకున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతులకు అక్కరకు రాలేదు. కానీ కార్పొరేట్ బహుళజాతి కంపెనీలకు దండిగా కాసులపంట పండించింది. ఫసల్ బీమా యోజన కింద 2016-17లో ప్రయివేట్ బీమా కంపెనీలు ప్రీమియం రూపంలో రైతుల నుంచి 21,500 కోట్లు దండుకున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పరిహారం కింద 4,270 కోట్లు క్లెయిమ్ చేయగా, 714 కోట్లు మాత్రమే ఇచ్చాయి. దీనిని బట్టి ఈ ఫసల్ బీమా యోజన ఎవరికోసం ఉద్దేశించిందో ఇట్టే అర్థమవుతోంది. వ్యవసాయరంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం, మేడ్ ఈజీ బిజినెస్ వంటి విధానాల ద్వారా మోడీ సర్కార్ ఈ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నది. దీనికి వ్యతిరేకంగా గ్రామీణ పేదలు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఆదివాసీలు సమైక్య పోరాటాలను ఉధృతం చేయడం ఒక్కటే మార్గం.

# వివక్ష లేని సమాజం కోసం

సమాజంపై అవగాహన ఎందరికో ఉండొచ్చు... మార్చాలనే తపన కొందరికే ఉంటుంది. అలా తపించే వారిలో ప్రొఫెసర్ లక్ష్మి ఒకరు. సమానత్వం, వివక్ష లేని మరో సమాజం కోసం నిరంతరం పోరాడుతున్నారు. విద్యార్థి దశ నుంచే హ్యూమనిస్టుగా, యాక్టివిస్టుగా స్త్రీ సమానత్వం కోసం గొంతు విప్పారు. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీకి మొదటి మహిళా ప్రిన్సిపల్‌గా చరిత్ర సృష్టించారు. రిటైర్‌మెంట్ తర్వాత కూడా స్త్రీ సమస్యలపై తన పోరాటం ఆపలేదు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్రంలో పెట్రేగుతున్న కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా తన గొంతు విప్పుతున్న ఆమెతో మానవి సంభాషణ...

ఇటీవల మన రాష్ట్రంలో కులదురహంకార హత్యలు బాగా జరుగుతు న్నాయి. వీటికి కారణం ఏమిటి?

ఇవి గతంలో కూడా ఉన్నాయి. అయితే బయటకు వచ్చే వాటి సంఖ్య చాలా తక్కువ. ఇప్పుడు మీడియా పెరిగిపోవడం వల్ల బయటకు ఎక్కువగా వస్తున్నాయి. కులం, మతం, మూఢనమ్మకాలు, సంప్రదాయాలు, ఇలా వీటన్నింటి వల్ల తల్లిదండ్రులు, కులపెద్దలు పిల్లల ఇష్టాలను అంగీకరించడం లేదు. రోజురోజుకు సమాజంలో కుల సమస్య పెరిగిపోతుంది. అందుకే ఈ హత్యలు జరుగుతున్నాయి.

ఈ వివాహాల వల్ల అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు?

మొదట తల్లిదండ్రులు ఆమె ప్రేమను అంగీకరించరు. ఇంట్లో వాళ్ళ ఇష్టాన్ని కాదని పెండ్లి చేసుకుంటే ఇల్లు వదిలి వెళ్ళిపోవాలి. సమాజం కూడా అమ్మాయి నిర్ణయాన్ని స్వాగతించదు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కరికైనా ఉద్యోగం లేకపోతే బతకడం కష్టం. ఆర్థిక ఇబ్బందులు వస్తాయి. ఈ ప్రభావం అమ్మాయిలపైనే ఎక్కువగా ఉంటుంది.

అసలు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే అవకాశం అమ్మాయిలకు ఎంత వరకు ఉందంటారు?

ఈ పితృస్వామ్య సమాజంలో ఆడపిల్లతో పాటే ఆంక్షలు, కట్టుబాట్లు కూడా పుడతాయి. ఎలాంటి బట్టలు వేసుకోవాలి?, ఎలా మాట్లాడాలి?, ఏం తినాలి?, ఎంత తినాలి? వరకు అన్నీ ఆంక్షలే. పెండ్లి సంబంధం వస్తే 'ఈ అబ్బాయి నాకు ఇష్టం లేదు' అని అంటే 'నోరుమూసుకో ఇంకెవరికీ చెప్పకు, నీ చెల్లెళ్ళకు పెండ్లి కాదు' అంటారు. రాజ్యాంగం ప్రకారం వివాహానికి సంబంధించి సమ్మతి హక్కు అమ్మాయికి ఉంది. కానీ దాన్ని ఎవ్వరూ పట్టించుకోరు. అమ్మాయికి జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ కల్పించాలి.

తల్లి ఇంటి పేరు, కులం పెట్టుకోవడంలో ఎన్నో ఆటంకాలు ఉన్నాయి. దీని గురించి మీరేమంటారు?

ఏ బిడ్డకైనా తల్లి ఒక వాస్తవం, తండ్రి ఓ నమ్మకం. తొమ్మిది నెలలు మోసిన తల్లి కులం బిడ్డకు వర్తించదంటారు. ఇది సరైనది కాదు. గతంలో స్కూల్లో తండ్రిపేరే అడిగేవారు. కానీ మహిళా ఉద్యమాల ఫలితంగా తల్లిపేరు కూడా చేర్చు కోగ లిగాం. అలాగే ఓ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పిల్లలు తల్లిదండ్రుల కులాల్లో తమకు ఇష్టమైన ఏ కులాన్నైనా పెట్టుకోవచ్చు.

మొదటి నుంచి మానవీయ విలువలతో పెరిగారు. మీ బాల్యం ఎలా గడిచింది?

మాది మిర్యాలగూడ. అక్కడే పుట్టి, పెరిగాను. అమ్మ విరాటమ్మ, నాన్న రామచంద్రయ్య. ఇద్దరూ వ్యవసాయం చేస్తారు. అమ్మ చాలా కష్టపడేది.

మా ఇంట్లో అన్ని కులాల వారినీ సమానంగా చూసేవారు. మేము ఎనిమిది మంది సంతానం. మా అమ్మ చదువు కోలేదు. నాన్న కొద్దిగా చదువుకు న్నారు. కానీ.. సామాజిక అవగాహనతో మమ్మల్ని చదివించారు. అయితే పదో తరగతి పూర్తి కాగానే ఆడపిల్లకు పెండ్లి చేయాలి అని భావించే పల్లెటూరు మాది. నాకూ అలాగే చేయాలనుకున్నారు. అయితే నేను ఒప్పుకోలేదు. స్కూల్ టాపర్ కావడంతో అన్నయ్యలు సపోర్ట్ ఇచ్చి ఇంటర్‌లో చేర్చారు. తర్వాత ఖమ్మంలో మా అన్నయ్య ఇంట్లో ఉండి అక్కడే డిగ్రీ చేశాను. మళ్ళీ ఇంటికి వెళితే పెండ్లి చేస్తారని అటునుంచి అటే స్నేహితులతో కలిసి హైదరాబాద్ వెళ్ళి పీజీకి ఎన్‌ట్రన్స్ రాశాను. మా ఊరి నుంచి ఎంట్రన్స్ రాసిన వారిలో యూనివర్సిటీలో సీటు వచ్చింది నాకొక్కదానికే. దాంతో ఊళ్ళో అందరూ మెచ్చుకున్నారు. దాంతో అమ్మానాన్నలు గర్వపడ్డారు. నేను ధైర్యం చేసి ఇంటికి వెళ్ళి డబ్బులు తెచ్చుకుని పీజీ పొలిటికల్ సైన్స్‌లో చేరాను. అలా మా కుటుంబంలో ఉన్నత విద్యను చదవిన మొదటి ఆడపిల్లను నేనే.

టీచింగ్‌వైపుకు ఎందుకు వచ్చారు?

పీజీ పూర్తి చేసిన తర్వాత బ్యాంక్ ఉద్యోగం కూడా వచ్చింది. కానీ ఆ టేబుల్ వర్క్ చేయడానికి మనసు అంగీకరించలేదు. ఎమ్‌ఫిల్‌లో చేరాను. తర్వాత 'మహిళా నాయకత్వం' అనే అంశంపై పీహెచ్‌డీ చేశాను. ఎప్పటికైనా అవినీతి ఉండని జాబ్ చేయా లనుకున్నాను. అప్పట్లో అలాంటి జాబ్ టీచింగ్. దాంతో ఇక టీచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాను. ఈ వృత్తిలోకి వచ్చిన తర్వాత యంగ్ టీచర్, బెస్ట్ టీచర్ అవార్డు తీసుకున్నాను. 2002లో ప్రొఫెసర్‌గా, తర్వాత ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించాను.

మరి యాక్టివిస్టుగా ఎలా మారారు?

విద్యార్థినిగా లేడిస్ హాస్టల్ వార్డెన్‌గా బాధ్యతలు చూసేదాన్ని. అక్కడే అనేక విద్యార్థి సంఘాలతో పరిచయాలు ఏర్పడ్డాయి. మా హాస్టల్లో పని చేసే వర్కర్లు ఉండే బస్తీలకు వెళ్ళి వాళ్ళకు అక్షరాలు నేర్పించేవాళ్ళం. యూనివర్సిటీలో ఏ అన్యాయం జరిగినా వ్యతిరేకించేవాళ్ళం. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం చేసేవాళ్ళం. జెండర్ సమస్యపై, సేవ్ గర్ల్ చైల్డ్ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేశాం. ఉమెన్స్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా మరెన్నో కార్యక్రమాలు చేశాం. ముఖ్యంగా అమ్మాయిలకు లీగల్, సోషల్ కౌన్సెలింగ్ ఇచ్చేవాళ్ళం.

మీదీ కులాంతర వివాహమే కదా, ఏమైనా సమస్యలు ఎదుర్కొన్నారా?

సమస్యలేమీ లేవు. మా వారి పేరు శివాజీ. ఆయన నాతో పాటు పీహెచ్‌డీలో చేశారు. దండలు కూడా మార్చుకోకుండా రిజిష్టర్ ఆఫీస్‌కు వెళ్ళి సంతకాలు పెట్టి వచ్చేశాం. పెద్దలు మాత్రం రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఆయనా లెక్చరర్‌గా చేసేవారు. అది మానేసి ప్రస్తుతం 'సర్వ్' అనే సోషల్ ఆర్గనైజేషన్‌లో పని చేస్తున్నారు. గ్రామాల్లో దళితులు, చెంచుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. మాకు ట్రిపులెట్ బేబీస్. ముగ్గురు బాబులు. ప్రస్తుతం ఇంటర్ పూర్తి చేసి పై చదువులకు సిద్ధంగా ఉన్నారు.

ఇన్ని బాధ్యతలు నిర్వర్తించారు. మీరెప్పుడైనా జెండర్ సమస్యను ఎదుర్కొన్నారా?

నేను స్ట్రాంగ్. అందుకే నా జోలికి ఎవ్వరూ రారు. అయితే యూనివర్సిటీలో జెండర్ సమస్యలు చాలా ఉన్నాయి. వీటిపై కచ్చితంగా పని చేసేవాళ్ళం. ఇప్పటికీ చేస్తున్నాం.

సరైన గైడెన్స్ ఇస్తే...

మహిళలు ఓ వ్యక్తిత్వంతో పెరగాలి. చదువుకోవాలి. స్వతంత్రంగా బతికే హక్కు ఉంది అని నమ్మాలి. నీ శరీరంపై నీకు హక్కు ఉండాలి. తనలో ఉన్న శక్తిని గుర్తించాలి. నేను ఆడపిల్లను అనే భావనను పక్కన పెట్టాలి. శారీరకంగా, మానసికంగా స్ట్రాంగ్‌గా ఉండాలి. నా కెరీర్‌లో ఎంతో మంది విద్యార్థులను చూశాను. యువతకు సరైన గైడెన్స్ ఇస్తే మంచి దారిలో వెళతారు. నా దృష్టిలో టీచర్ అంటే పుస్తకాల్లో ఉండేది నాలుగ్గోడల మధ్య చెప్పడం కాదు, సమాజం గురించి, జీవితం గురించి నేర్పాలి. ఉపాధ్యాయులు ఇలా చేయగలిగితే ప్రతి అమ్మాయి, అబ్బాయి ఆణిముత్యాల్లా తయారవుతారు.

ప్రత్యేక చట్టం కావాలి

దేశంలో సమసమాజం రావాలన్నా, కులర హిత సమాజం ఏర్పడాలన్నా, స్త్రీ-పురుషుల మధ్య అంతరాలు తొలగించాలన్నా కులాంతర వివాహాలు చేసుకునే వారికి కొన్ని అవకాశాలు కల్పించాలి. వీరికి రక్షణ కల్పించే ప్రత్యేక చట్టం కావాలి. ముందు ఆ జంటకు ఆర్థికంగా సహకరించాలి. ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. అమ్మాయిలకు ధైర్యం చెప్పాలి. వారి పిల్లలకు అన్నింట్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి. అలాగే భద్రత అనేది కీలకం. కాబట్టి వీరి వివాహాలను రికార్డ్ చేయాలి. అన్నింటి కంటే ముఖ్యంమైనది ఇలాంటి వివాహాల పట్ల సమాజానికి అవగాహన కల్పించాలి.

విధాన నిర్ణయాల్లో

భాగస్వామ్యం

విధాన నిర్ణయాల్లో మహిళలకు భాగస్వామ్యం లేదు. మహిళల సమస్యలంటే సంస్కరణ దృష్టితోనే చూస్తున్నారు. మహిళలకు విధాన నిర్ణయాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా స్త్రీ సమానత్వం సాధ్యం కాదు. మన రాష్ట్రంలో మంత్రి మండలిలో ఒక్క మహిళకు అవకాశం ఇవ్వలేదు. వీసీలుగా ఒక్క మహిళను తీసుకోలేదు. ఏండ్లు గడుస్తున్నా మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగానే చూస్తున్నారు. సమాజంలో సగభాగమైన మనకు అధికారంలో కూడా మన వాటా మనకు రావాలి.

# లక్ష్యం

నాంపల్లి, మేజర్‌న్యూస్ ః పడుకున్నవాడు లేచి తిరిగి మళ్లీ పడుకోవడమే జీవితమని కొందరంటున్నారు. 'కలకానిది విలువైనది జీవితం' అన్నాడు.. శ్రీశ్రీ. జీవితం ప్రవాహం, జీవితం నది, జీవితం స్రవంతి. ప్రవాహం నిరంతరం కదులుతుంటుంది. కదలికలేని ప్రవాహం లేదు. నది నిరంతరం చలనంతో ఉంటుంది. అయినా చలించినట్టు కనబడదు. నిరంతరం కదులుతూ కదిలినట్టు కనిపించనిదే జీవితం అంటాడు దాశరథి రంగాచార్య. నది ప్రవాహం జీవనవేగాన్ని సంకేతిస్తున్నది. నీటి పరుగు చైతన్యాన్ని సూచిస్తున్నది. జీవిత ప్రవాహం ప్రచండ వేగంతో వెళ్లిపోతూ ఉంది. అందులో ఎవరెవరి సంస్కారాన్ని బట్టి వాళ్లు తమ సుఖం కోసం కొట్లాడుకుంటున్నారు అంటాడు అసమర్థుని జీవయాత్రలో గోపీచంద్. అసలు మనం సక్రమంగా జీవించలేకపోతున్నాం... జీవితంలో అనేకనేక అవకాశాలు మన ముందు కొస్తుంటాయి. అన్నీ ముఖ్యమనిపించినా ఎదురైన ప్రతి అవకాశం అందిపుచ్చుకోలేము. అందుకే జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికున్న అవకాశాలను పరిశీలించుకుని ముందుకు పోవాల్సి ఉంటుంది. నీటి ప్రవాహాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. ప్రవాహానికి అడ్డువస్తే నీళ్లు అక్కడే ఆగిపోవు. కొత్తదారి వెతుక్కొని కొండల్లో జలపాతాలుగా రాళ్ల మధ్య పాయలుగా, ఇసుకమేటల్లో ఏర్లుగా ప్రయాణాన్ని సాగిస్తాయి. విద్యార్థి అయితే తాను ఏ వృత్తిలో స్థిరపడదలచుకున్నాడో లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. అందుకనుగుణమైన కోర్సునే ఎంచుకోవాలి. ఊహల్లో విహరించకుండా వ్యూహంతో చదివితే లక్ష్యం సిద్ధిస్తుంది. ఎక్కడో మారుమూల ప్రాంతంలో పేదరికంతో పోరాడుతూ... గోపాలకృష్ణ ఐఏఎస్ లక్ష్యంగా నిర్దేశించుకుని విజయం సాధించిన అనుభవం మన కండ్లముందే కనబడుతున్నది. "ఒక నదిని దాటడం నీ లక్ష్యమైతే.. అందుకు నావగాని, వంతెన గాని లేకుండా నదిని దాటడం సాధ్యం కాదు" అన్నాడు మావో. అంటే లక్ష్యం మంచిదైనా దాన్ని చేరుకోవడానికి నిర్ణయించుకునే సాధనాలపైన జయపజయాలు ఆధారపడి ఉంటాయి. ఏ లక్ష్య సాధనకైనా క్రమశిక్షణ అవసరం. వ్యక్తిగత లక్ష్యాలతో లాభనష్టాలూ కష్టసుఖాలు ఆయా వ్యక్తుల వరకే పరిమితం అవుతాయి. అదే మన సమాజానికి బాధ్యత వహించినప్పుడు సమిష్టి లక్ష్యంగా మారుతుంది. తప్పుడు లక్ష్యాల వల్ల మనమే కదా నష్టపోయేది అనుకుంటే కుదరదు. దాని ప్రభావం మొత్తం సమాజంపైనా ఉంటుంది. లక్ష్యాలు ఉన్నతమైనవైతే సాధనఎలాంటివైనా పరవాలేదా? శంకరాచార్యుడు జీవాత్మ - బ్రహ్మాత్మల ఏకత్వాన్ని తెలుసుకోవడమే లక్ష్యం అన్నాడు. ఇందుకు జ్ఞాన సంపాదన మార్గమన్నాడు. వీరు వాస్తవ జీవితంతో సంబంధం లేని లక్ష్యాన్ని ఎంచుకున్నారు.

కమ్యూనిస్టుల దృష్టిలో జీవిత లక్ష్యం మానవజాతి సుఖసంపదలతో జీవించడం. భౌతికంగానూ, సాంస్కృతికంగానూ అంతకంతకు ఉన్నత శిఖరాలకు అందుకోవడం. ప్రతి మానవుడు తోటి వారితో కలిసి మానసిక శక్తులను అభివృద్ధి చేసుకోవడానికి అంతకంటే ఎక్కువ స్వేచ్ఛ సంపాదించడం. పరాయి పాలనకు స్వస్తిపలికి స్వాతంత్ర్యం సాధించుకునేందుకు భారత ప్రజలు శత సంవత్సరాలు పోరుసల్పారు. ఈ వందేండ్ల స్వాతంత్ర్య పోరాటం మన లక్ష్యంగా ఉన్నది. లక్ష్యం మహోన్నతమైనదని అందరూ అంగీకరించారు. ఏకాభిప్రాయానికి వచ్చారు. కానీ సాధన మార్గం విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవచ్చు. అహింసను జీవిత లక్ష్యంగా పెట్టుకున్న గాంధీ మహాత్ముడే పిరికితనంతో బానిస జీవితం గడపడం కన్న దౌర్జన్యంతో శత్రువును ప్రతిఘటించడం మంచిదన్నాడు. ఉరితీయబడ్డ భగత్‌సింగ్ దేశభక్తిని పొగుడుతూనే అతడు ఎంచుకున్న మార్గం సరైనది కాదంటూ గాంధీజీ పెట్టిన తీర్మానం కాంగ్రెస్‌లో వీగిపోయింది. ఆ కాలంలో దేశం కోసం పోరాడి అమరులైన వారందరు వీరులుగా కీర్తింపబడ్డారు. స్వాతంత్ర్యం సిద్ధించింది. అప్పుడు ఏంచేయాలి అనే ప్రశ్న ముందుకు వచ్చింది. ఒక సమస్యను పరిష్కరిస్తే ఆ సమస్య పరిష్కారంలో మరొక సమస్య పుట్టుకొస్తుంది. ఒక గమ్యాన్ని చేరుకొని అక్కడే ఆగిపోవడం కాదు. ఎప్పటికప్పుడు సమస్త అవకాశాలను వినియోగించుకుంటూ నూతన లక్ష్యాలను చేరుకోవటం. విజయాల మీద విజయాలు సాధిస్తూ కొనసాగించే అనంతయాత్ర, అట్టి యాత్రలో ప్రతిలక్ష్యం ఒక మజిలీ, మరొక లక్ష్యాన్ని సాధించడానికి అదొక ప్రారంభం. నూతన లక్ష్యాలను నిర్దేశించుకునేటప్పుడు మన మార్గం, గమ్యాన్ని బట్టీ పరిస్థితులను బట్టీ కూడా ఉంటుంది. గమ్యాన్ని మరచిపోతే కోరిన లక్ష్యం కాక విరుద్ధమైన ఫలితాలు వస్తాయి. భారత రాజ్యాంగంలో సోషలిజం లక్ష్యంగా ప్రకటించారు. దాన్ని సాధించాలంటే పెట్టుబడిదారీ పద్ధతులు ఎన్నటికీ పనికిరావు. నెరవేరని లక్ష్యాలు పెట్టుకుంటే ఎవరైనా కొంత కాలానికి గందరగోళంలో పడిపోతారు. భవిష్యత్తు చీకటిగా మారుతుంది. మనిషి సంఘ జీవితాన్ని నియంత్రించటానికి రాజ్యం ఏర్పడింది. అది ఏది చెయ్యాలి, ఏది చేయకూడదో చెబుతుంది. అది ఎక్కువ మందిని బాధపెట్టే స్థితికి వస్తుంది.

సూర్య



# విద్యార్థినికి అభినందన



కోదాడ (మేళ్ళచెర్వు), మేజర్ న్యూస్ : మేళ్ళ చెర్వుకు చెందిన అన్నెపంగు అపూర్వ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 9.7 గ్రేడ్ సాధించింది. సత్యసాక్షి ప్రార్ధనా మందిరం వారు న్యాయవాది మాధవరపు రామకృష్ణ చేతుల మీదుగా బహుమతి అందజేశారు. విద్యార్థినిని అభినందించారు. చినిగిరి రాజ్ కుమార్, యాతాకుల రాంబాబు, పోలీశ్వరారావు, ఉపేందర్ పాల్గొన్నారు.

# పిడుగుపాటుతో ఒకరు మృతి



కనగ ల్,మేఉజర్న్యూస్ః మండలంలోని జీ.యడవల్లి గ్రామానికి చెందిన తలారి ఊషయ్య(59)ఆదివారం పిడిగుపాటుకు గురై మృతి చెందాడు. ఇందుకు సంబందించి కనగ ల్ ఎస్ఐ రామకృష్ణ సోమవారం తెలిపారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఊషయ్య రోజు వారి వృత్తిరీత్య కల్లుగీసుకుని జీవనం కొనసాగిస్తున్న క్రమంలో ఆదివారం సాయంత్రం తాడు ఎక్కి కల్లుతీసుకుని కిందకు వస్తున్న క్రమంలో ఆకాల వర్షం,ఈదురుగాలతో పిడుగు పడి ఊషయ్యకు తీవ్ర గాయాలై మృతి చెందినట్లు వివరించారు.మృతుని కొడుకు తలారి గణేష్ ఇచ్చిన పీర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు పేర్కోన్నారు.

# చేతబడి నెపంతో వృధ్ధురాలి హత్య

నడిగూడేం,మేజర్న్యూస్:చేతబడి చేస్తుందనే నెపంతో వృధ్ధురాలిని హత్య చేసిన సంఘటన త్రిపురవరం లో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపారు.అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామానికి చెందిన కొమ్ము అలివేలమ్మ భర్త నరసయ్య ను అదే గ్రామానికి చెందిన హుస్సేన్ అనే వ్యక్తి స్నేహితులతో కలిసి అలివేలమ్మ మెడకు తాడు బిగించి హత్య చేసాడని మృతురాలి మనవడు సాయి కృష్ణ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అరణ్యం

తిప్పర్తి, మేజర్న్యూస్ ః అడవులు భద్రంగా ఉంటే మనుషులు క్షేమంగా ఉంటారు. ఈ చిన్న విషయం తెలియక కాదు, తెలిసీ అడవుల విధ్వంసాన్ని ఆపలేకపోవడం ఆధునిక మానవుని దుస్థితి. మరీ ముఖ్యంగా సంపన్న వర్గాల, సంపన్నదేశాల విధానాలు అడవుల క్షయానికి దారితీస్తున్నాయి. ఇటీవల అమెజాన్ అడవులు దగ్ధం కావడం పర్యావరణవేత్తల్ని, ప్రకృతి ప్రేమికుల్ని తీవ్ర ఆందోళనకు లోను చేసింది. ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. తమ అభివృద్ధికి ఆటంకమైతే అడవుల్ని ఉపేక్షించడం సాధ్యం కాదన్నది పాలకుల సమాధానం.

మన దగ్గర నల్లమల్లలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా వినిపించిన తీవ్ర నిరసనల నేపథ్యంలో వాటిని అనుమతించబోమని పాలకులు చెప్పారు. అయినప్పటికీ ఆచరణలో ఏం జరుగుతుందన్నది ప్రశ్నే.. ఆదిమానవుల నివాసం అరణ్యమే. అరణ్యాల్ని దాటుకొని ప్రయాణించే క్రమాన చెట్లని నరికివేసి, వ్యవసాయయోగ్యమైన భూములుగా మార్చారు. అంతమాత్రాన ఇవాళ భారీ ప్రాజెక్టులు, మైనింగ్ తవ్వకాల కోసం వేలాది హెక్టార్ల అడవుల్ని నిర్మూలించడం క్షంతవ్యం కాదు. ఎందుకంటే జీవవైవిధ్యం సమతుల్యం మీదనే మానవుని జీవనం ఆధారపడి ఉంది. ఉత్తరాఖండ్లో ఉవ్వెత్తున వచ్చిన వరదలకు, అక్కడ కొండల మీద నిర్మించిన ప్రాజెక్టులే కారణమని పర్యావరణవేత్తలు తేల్చిచెప్పారు.

మానవుని అవసరాలకు అనుగుణంగా అడవుల్ని ఉపయోగించుకోడంలో తప్పులేదు. అడవుల్లోని జీవ వైవిధ్యానికి, పచ్చదనానికి భంగం కలగకుండా వాటిని వినియోగించుకునే విధివిధానాల్ని అనుసరించాలి. దీనికి భిన్నంగా అడవుల్ని నేలమట్టం చేయడం దుర్మార్గం. ఇది కూర్చున్న చెట్టు కొమ్మను తానే నరుక్కోవడం వంటి ఆత్మహత్యాసదృశ్యమైన చర్య.

ఈ సత్యం అందరికీ తెలుసు. అయినా లక్షల హెక్టార్ల అడవుల నిర్మూలనకు ప్రభుత్వాలు అనుమతించడం వైచిత్రి. కలపదొంగల వల్ల, జంతువుల్ని వేటాడేవారి వల్ల జరిగే నష్టం చాలా చిన్నది. వీరితో పో లిస్తే అడవి ఉనికిని దెబ్బతీసే ప్రభుత్వ విధానాలు అడవులకీ, వాటిని అంటిపెట్టుకొని ఉన్న జనాలకీ తీవ్రమైన శరాఘాతం. ఒకవైపు అటవీభూభాగ విస్తీర్ణం తగ్గిపోతుంటే మరోవైపు ఈ విస్తీర్ణం పెరుగుతున్నట్టుగా ప్రభుత్వం చెబుతున్నది. ఇది అంకెల గారడీ. ఒకప్పుడు మన దేశంలో 30శాతానికి పైగా అడవులు విస్తరించి ఉండేవి. ఇవుడు దేశ భూభాగంలో అటవీ విస్తీర్ణం 21.34శాతం మాత్రమే. దట్టమైన అరణ్యాల జోలికి అసలు వెళ్ళకూడదని అంతర్జాతీయంగా పర్యావరణవేత్తలు పదేపదే చెబుతున్నారు. కానీ మన దేశంలో భారీ డ్యాంల కోసం, రక్షణ విభాగం, జలవిద్యుత్ ప్రాజెక్టులు, గనుల నిర్మాణం కోసం దట్టమైన అరణ్యాల్ని సైతం నిర్మూలిస్తున్నారు. దీని ప్రభావం దీర్ఘకాలికం. జీవవైవిధ్యం దెబ్బతినడమే కాక అకాల వర్షాలు, తుఫాన్లు, వరదలు, భూకంపాలు తలెత్తడానికి దారితీస్తుంది.

అభివృద్ధి జరగాలంటే అడవులు అంతరించక తప్పదనే వాదన ముందుకు తెస్తున్నారు. అభివృద్ధి ఎవరికోసం, ఎందుకోసమనే ప్రశ్నలకు సరయిన జవాబు ఉండదు. దేశీయ పెట్టుబడిదారులకోసం, బహుళజాతి కంపెనీల కోసం అడవుల్ని నిర్మూలించడాన్ని భవిష్యత్ తరాలు క్షమించవు. అడవుల్ని నరికివేసే క్రమాన ఎన్ని చెట్లను కోల్పోతారో, అన్ని చెట్లను ప్రత్యామ్నాయంగా మరోచోట పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రకారం కృత్రిమంగా మొక్కల పెంపకం కార్యక్రమాలు చేపడుతున్నారు. కానీ అరణ్యమంటే కేవలం చెట్లు కాదు, పక్షులు, జంతువులు, నేల, అక్కడ నివసించే మానవులు... ఇంకా అపారమైన జీవవైవిధ్యం. వాటిని మరోచోట వున:ప్రతిష్టించడం సాధ్యం కాదు. యురేనియం కోసం నల్లమలని నాశనం చేస్తే మరోచోట దానిని అంతే సహజసిద్ధంగా నిర్మించగలరా? ఇవాళ దగ్ధమవుతున్న అరణ్యాల్ని మరల సృజించడం సాధ్యమా?

ప్రకృతి ప్రసాదించిన అవురూప వరాలు అరణ్యాలు. మానవాళికి అవాసంగా, ఆసరాగా ఈ అరణ్యాల గొప్పతనాన్ని, వాటి సహజ సౌందర్యాన్ని విభూతి భూషణ్ బందోపాధ్యాయ 'వనవాసి' నవలలో అద్భుతంగా చిత్రించారు. 'అడవి గాచిన వెన్నెల' అంటారు. కానీ చంద్రోదయాన్ని, హొయలు పోయే వెన్నెల అసలుసిసలు సౌందర్యాన్ని అడవిలో మాత్రమే చూడగలం. 'అడవి తల్లికీ దండాలో' అని మనవాళ్ళు పాడుకుంటారు. అటవీ వైవిధ్యాన్ని, మాయమర్మం ఎరుగని ఆదివాసుల జీవన రీతులను అల్లం రాజయ్య, సాహుల 'కొమురం భీము', వసంతరావు దేశ్పాండే 'అడవి' నవలల్లోనూ చదివి ముగ్ధులమవుతాం. కేశవరెడ్డి నవల 'అతను అడవిని జయించాడు' ఒక దృశ్యకావ్యమనే చెప్పాలి. అల్లం శేషగిరిరావు రాసిన వేట కథల్లోనూ అడవి ఔన్నత్యం రూపుగడుతుంది. తెలుగు కవులకీ, కథకులకీ అడవి గొప్ప ప్రేరణ, తరగని ఇతివృత్తం.

ఇవాళ నల్లమల్లలో యురేనియం తవ్వకాలంటే మండిపడుతున్న కవులు, రచయితలు తమ కలాలకు పదునుపెట్టారు. అడవిని స్మరిస్తున్నారు. అడవి వస్తువుగా కవిత్వాన్ని సృజిస్తున్నారు. నిజానికి గొప్ప సాహిత్యసృష్టికి అడవులే కదా మూలం. రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాల్లో అరణ్యాల వర్ణన కమనీయం. బెజ్జారవు రవీందర్ రాసిన 'తాటక' నవల అడవుల్ని నిర్మూలించే వారికీ, వాటిని కాపాడుకోవాలనుకునే వారికి మధ్య జరిగిన ఘర్షణని ప్రతీకాత్మకంగా చూపింది. అడవుల్లేని ప్రపంచాన్ని ఊహించగలమా? అడవుల్ని నిర్మూలిస్తేనే విద్యుత్ వెలుగులు లభిస్తాయంటే ఆ వెలుగులు ఎవరికోసం? ఎందుకోసం? అనే ప్రశ్నలు సహజం. అరణ్యం పట్ల సృజనశీలుర అమేయమైన మమకారమే ఈ ప్రశ్నలకు మూలం. ఇది అరణ్యాలను కాపాడుకునే దిశగా క్రియాశీలతని సంతరించుకోడం ఇవాళ్టి అవసరం.

# మౌన యుద్ధం మనిషి మిన్న

తిప్పర్తి, మేజర్న్యూస్ ః మనిషికన్నా మనిషి మాటకున్న విలువ మిన్న మనుషుల మధ్య మాటలకున్న విలువ మరీ మిన్న మనుషుల మధ్య మాట కరువైనవుడు శ్మశాన నిశ్శబ్దం రాజ్యమేలుతుందిపభ్రుత్వానికీ ప్రజలకూ మధ్య మాట కరువైనవుడు రాజ్యమే ఒక శ్మశానాన్ని తలపిస్తుంది- అవును! ఇప్పుడు కాశ్మీర్లో అదే జరుగుతోంది. ఉగ్రవాదానికి-కేంద్రానికి మధ్య అంటూ మొదలైన యుద్ధం ఇప్పుడు కేంద్ర పాలక పార్టీకి - కాశ్మీర్లోని ప్రజాస్వామ్య పార్టీలకూ మధ్య కేంద్రీకృతమైంది. ఫలితంగా కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ముగ్గురూ చెరసాలలో మగ్గుతున్నారు. భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరుగుని విపరీతమిది. తలచుకుంటేనే వొళ్లంతా జలదరించే అనూహ్యమైన అప్రజాస్వామిక పరిణామమిది. మరీ ముఖ్యంగా భారతదేశ జాతీయజెండా కాశ్మీర్లో సగర్వంగా ఎగిరేందుకు జీవితాంతం చావుకు ఎదురీది శ్రమించిన 81ఏండ్ల కురువృద్ధుడు, మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లాను అరెస్టు చేయడం. ఫరూఖ్ అబ్దుల్లా విషయంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పరమ దుర్మార్గమైనది. ఆర్టికల్ 370ని రద్దు చేసిన ఆగస్టు 5 నుంచే ఫరూఖ్ను గృహనిర్బంధంలో ఉంచారు. ఆగస్టు 6న కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రసంగిస్తూ ఫరూఖ్ను అరెస్టు చేయడం కానీ, నిర్బంధంలోకి తీసుకోవడం కానీ జరగలేదని నిస్సిగ్గుగా పచ్చి అబద్ధమాడారు. దీంతో తమిళనాడుకు చెందిన ఎండీఎంకే నేత వైగో ఫరూఖ్ ఎక్కడున్నారో చెప్పాలంటూ సుప్రీం కోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్ దాఖలు చేయడంతో ఆయనను అరెస్టు చేసినట్టు ప్రకటించారు.

సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే తరిగామితో సహా కాంగ్రెస్, నేషనల్ కాంగ్రెస్, పీపుల్స్డెమోక్రటిక్ ఫ్రంట్.. పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములైన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలంతా ఇప్పుడు నిర్బంధంలో మగ్గుతున్నారు. ఇన్నాళ్ళూ కాశ్మీర్ ప్రజల గొంతుకగా ఉన్నవారు, వేర్పాటువాదుల నుంచి పొంచి ఉన్న ముప్పుకు బెదరకుండా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వాళ్ళంతా జైళ్ళల్లో మగ్గుతున్నప్పుడు ఇక అక్కడ రాజకీయ ప్రక్రియకు తావెక్కడిది? దశాబ్దాలుగా రగులుతూ ఉన్న కాశ్మీర్ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు వీలెక్కడిది? అంటే, కేంద్ర ప్రభుత్వం కాశ్మీర్ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించేందుకు సిద్ధంగా లేదని మనకు అర్థమవుతున్న అంశం.

మరి, రాజకీయ ప్రక్రియకు పూర్తిగా తలుపులు మూసేసిన కేంద్రం ఇప్పుడు అక్కడ ఏమి చేయబోతోంది? మాటలకు (చర్చలకు) మార్గం మూసేసిన తరువాత ఏమి జరుగుతుంది? మరింతగా నిర్బంధం పెరుగుతుంది. మరిన్ని వేలమందిని జైళ్ళల్లో కుక్కేస్తారు. కాశ్మీర్లో జైళ్ళు చాలకపోతే దేశంలోని జైళ్ళన్నిటికీ కాశ్మీరీయులను తరలిస్తారు. నిజానికి ఇప్పటికే ఆ తరలింపు మొదలయ్యింది. ఇంటికొక్కరు, ఆ ఇంటిని పోషించాల్సిన అవసరం, శక్తి ఉన్నవాళ్ళు ఇంటికి దూరమైన తరువాత ఆ కుటుంబం, కుటుంబానికి దూరమై జైలులో ఉన్న వ్యక్తి డీలా పడిపోతాడనీ, తీవ్ర నిరాశలో, నైరాశ్యంలో కూరుకు పోతారనీ, ఎంత ప్రతిఘటించినా వ్యర్థం, అత్యంత బలమైన రాజ్యంతో ఢకోని తాము అనుకున్నది సాధించడం అసాధ్యమన్న నిర్ణయానికి వచ్చి సర్కారుతో రాజీ పడతారనీ, ఉన్న దాంతో సర్దుకుపోవడం అలవర్చుకుని అణగిమణగి పడిఉంటారనీ.. కేంద్రంలోని కాషాయ ప్రభుత్వం భావిస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే కేంద్రంలోని బీజేపీ సర్కార్ కాశ్మీర్ ప్రజలపై మానసిక యుద్ధం చేస్తున్నదిప్పుడు. చుట్టూ నిశ్శబ్దాన్ని నింపి, నిశ్శబ్దంలో జనాన్ని నింపి, ఆ మాటలు లేని మౌన జీవితంతో జనం విసిగివేసారిపోయేలా చేసి లొంగదీసుకోవాలని చూస్తోంది.

కాశ్మీర్లో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పూర్తిగా సమర్థనీయమని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రకటించిన తరువాత ఇక ప్రజలకు ప్రత్యామ్నాయం ఎక్కడిది? తమకు జరుగుతున్న అన్యాయాన్ని, తమపై జరుగుతున్న దౌర్జన్యాన్ని జనం ఎక్కడికెళ్లి విన్నవించుకోవాలి? తమకు న్యాయం జరిగేలా చూడాలని ఎవరిని వేడుకోవాలి? అలా విన్నవించుకునే, వేడుకునే అవకాశం లేకుండా చేయడమే నరేంద్ర మోడీ సర్కారు ఎత్తుగడ. ప్రత్యామ్నాయం కోల్పోయిన జనం అనివార్యంగా తాము చెప్పినట్టు వింటారని, తమ కాళ్ల చెంత పడి ఉంటారనీ కమలనాథుల నమ్మకం.

నిజమే! లోపల రగులుతున్న అగ్నిపర్వతం కూడా బద్ధలయ్యే వరకూ పైకి ప్రశాంతంగానే కనిపిస్తుంది. అంతమాత్రాన అది బద్దలయ్యేవరకు తనలోపల ఉన్న గుణాన్ని కోల్పోయినట్టు కాదు. ప్రజలూ అంతే. జీవితం తమలో రగిలించిన తిరుగుబాటు తత్వాన్ని ఆశయం సిద్ధించేంత వరకూ అస్సలు కోల్పోరు. ప్రతికూల పరిస్థితుల ప్రభావంతో లోలోన అణచుకుంటారు. అదనుచూసి అగ్నిపర్వతమై బద్ధలవుతారు.

# నిజాయితీ నిరూపించుకోవాలి

మిర్యాలగూడ, మేజర్న్యూస్ ః యురేనియం తవ్వకాలపై ముఖ్యమంత్రి మూడ్రోజుల క్రితం నోరు విప్పారు. నల్లమలలోనే కాదు రాష్ట్రంలో ఎక్కడా యురేనియం తవ్వకాలకు అనుమతీయబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉభయసభల్లో ఏకవాక్య తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా సీఎం మరో అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రత్యేకరాష్ట్రం ఏర్పడ్డనాటి నుంచీ ఎవరికీ, ఏవిధమైన అనుమతులూ యివ్వలేదన్నారు. ఇక మీదట ఇవ్వబో మనీ తెలిపారు. ఆలస్యంగానైనా సీఎం స్పందించడం, ప్రభుత్వ వైఖరి చెప్పడం శుభపరిణామం. రాష్ట్రాన్ని చుట్టు ముట్టిన యురేనియం ముప్పుపై పోరు చేస్తున్న జనావళికి ఈ పరిణామాలు నైతికబలాన్నిస్తాయ నడంలో సందేహం లేదు. అదే సందర్భంలో ఇక అంతా రాష్ట్ర సర్కారే చూసుకుంటుందిలే.. అనే భ్రమలూ అక్కర్లేదని పర్యావరణ వేత్తలూ రాజకీయ విశ్లేషకులూ హెచ్చరిస్తున్నారు. అందుకని ఇప్పటికిప్పుడే ప్రభుత్వాన్ని అనుమానించలేం. కానీ ఆ వైపు సర్కారు నుంచి ఆచరణాత్మక అడుగులు అవసరం. ఈ ప్రకటనలకు మూడ్రోజుల ముందూ తర్వాతా కేంద్రం తన పని తాను చేసుకుపోతూనే ఉన్నది. 'సేవ్ నల్లమల' పేరుతో బయటా, సోషల్మీడియా వేదికగానూ వ్యక్తమవుతున్న నిరసనలను ఖాతరు చేయడం లేదు. అందుకు రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు(అటవీ, పర్యావరణ, మైనింగ్) అవసరమైన సాయం చేస్తూనే ఉన్నాయి. సమస్య రాష్ట్రమంతా రగులుతున్న ఈ దశలో ముఖ్యమంత్రికి తెలియకుండా ఈ పని జరుగుతున్నదనుకోలేం. ఉభయ సభల్లో ఏకగ్రీవ తీర్మానం చేసిన రోజు కూడా యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) బృందం అధికారులు నాగర్కర్నూల్ సందర్శించారు. స్వయంగా యూసీఐఎల్ లోగోతో ఉన్న వాహనంలోనే ఢిల్లీ నుంచి అధికారులు ఇక్కడ కాలుమోపారు. అటకాయించి నిలదీసిన ఆందోళనకారులకు, ప్రశ్నించిన మీడియాకు మాత్రం మొక్కలు, తొక్కలకోసమొచ్చామని బుకాయించారు. ఆయుర్వేద మందుల తయారీకవసరమయ్యే మొక్కల పరిశీలన, పరిశోధనలు చేస్తున్నట్టు నమ్మబలికారు. ఆ మరుసటి రోజు కూడా ఈ ప్రాంతంలో కేంద్రానికి చెందిన ఓ హెలికాప్టర్ ఏరియల్ సర్వే చేసిందని స్థానికులు చెబుతున్నారు. వెయ్యిమీటర్ల లోతులో వేసిన బోర్ల నుంచి నీళ్లూ మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. భూ సేకరణకు రహస్య సర్వేలు కొనసాగుతూనే ఉన్నాయి.

కేంద్రం నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని, ఏకపక్షంగా పోతున్నదని ఐదేండ్ల పాలనలో అర్థమైంది. రాజ్యాంగ వ్యవస్థల్ని నిర్వీర్యం చేసింది. కార్పొరేట్ అనుకూల విధానాలను మరింత వేగంగా అమలు చేసింది. ఫలితంగానే దేశ ప్రజలు నేడు మాంద్యంలోకి నెట్టబడ్డారు. తాజాగా యురేనియం తవ్వకాలూ వారి ప్రయోజనాల కోసమేనని ప్రజలూ రాష్ట్ర ప్రభుత్వమూ గ్రహించాలి. భూమి లోపల ఉన్న ఈ అణుధార్మిక పదార్థం ఓసారి బయటకొస్తే సంభవించే ముప్పును ఎవ్వరూ ఆపలేరు. యురేనియం అనుభవాలను ప్రత్యక్షంగా చవిచూసిన ధనిక దేశాలు వాటి తవ్వకాల నుంచి క్రమంగా తప్పుకుంటున్నాయి. అగ్రరాజ్యం అమెరికా కూడా 1982 తర్వాత ఈ తవ్వకాలను దాదావు నిలిపేసింది. తవ్వకాలకు వ్యతిరేకంగా ఆ దేశంలో పెద్దఎత్తున ఉద్యమాలూ సాగాయి. ఈ నేపథ్యంలో ధనిక దేశాలు యురేనియంతో నడుస్తున్న అణువిద్యుత్ కేంద్రాలను మూసేశాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో దాని వినియోగం పెంచడం ద్వారా తమ అవసరాలు తీర్చుకోవాలని భావిస్తున్నారు. బహుళజాతి సంస్థలు, బడాకార్పొరేట్ల సేవలో తరిస్తున్న మన పాలకులు అందుకు జీ హుజూర్ అంటున్నారు. మన ప్రజలను బలిపశువులను చేసి మరీ దేశ ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారు. ఇందులో మోడీ ముందున్నారు. ఆ విధానాల దుష్ఫలితాలు మనం అనుభవిస్తూనే ఉన్నాం.

# దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి

## ఆత్మజ్ఞానమే అసలైన సిరి

## ఆధ్యాత్మిక రహస్యాలను విప్పిచెప్పిన త్రిమత ఏకైక గురువు, ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు

## హుజూర్ నగర్ పట్టణంలో ధర్మ ప్రచారం





కోదాడ (హుజూర్‌నగర్), మేజర్‌న్యూస్ : ఇందూ జ్ఞాన వేదిక, ప్రబోధ సేవా సమితి కోదాడ శాఖ ఆధ్వర్యంలో హుజూర్ నగర్ పట్టణంలో ధర్మ ప్రచారం నిర్వహించారు. త్రిమత ఏకైక గురువు, ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు త్రైత సిద్ధాంతం ఆధారంగా 100కు పైగా గ్రంథాలు రచించి ఆత్మజ్ఞానాన్ని బహిర్గతం చేశాడన్నారు. ఎన్నో ఆధ్యాత్మిక రహస్యాలను విప్పిచెప్పి మోక్షమార్గం గురించి బోధించాడన్నారు. మనమంతా పెద్దలు చెప్పిన సామెతలు, పొడుపు కథలను నిత్య జీవితంలో ఉపయోగిస్తుంటాం. వాటికి మనం తెలిసిన అర్థం చెప్పుకుంటాం కానీ వాటి వెనుక ఉన్న అసలైన భావాన్ని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు బహిర్గతం చేశాడన్నారు. మనమంతా దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే సామెతను వాడుతుంటాం. ఈ సామెతకు మనకు తెలిసిన అర్థం ఏమిటంటే ఏ అవకాశం వదిలిపెట్టకుండా, వీలైనంత ప్రపంచ ధనం కరెన్సీ, బంగారం, స్థిరాస్థులు సంపాదించుకోమనేలా భావిస్తుంటాం. అది సరైన అర్థం కాదనీ, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి అంటే శరీరంలో ఆత్మ (దీపం) ఉన్నప్పుడే దేవుడిజ్ఞానం తెలుసుకొని దేవదేవుడైన పరమాత్మలోకి ఐక్యం అయ్యేలా ప్రయత్నం చేయడమని అసలైన అర్థాన్ని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వివరించాడన్నారు. సృష్టిలోని జీవరాశుల్లో మానవ జన్మ ఉన్నతమైనదన్నారు. మానవ జన్మ లభించినప్పుడు కాలాన్ని వృధా చేయకుండా దేవుడి జ్ఞానం తెలుసుకునేందుకు శ్రద్ధ చూపాలన్నారు. తర్వాత జన్మ మానవ జన్మ లభిస్తుందన్న నమ్మకం లేదన్నారు. ఒకవేళ మానవ జన్మ లభించినా దేవుడి జ్ఞానం తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పలేమన్నారు. బాల్యం, యవ్వనం, కౌమారం, వృద్ధాప్యం అనే నాలుగు దశలుగా మానవ జన్మ ఉంటుందన్నారు. బాల్యంలో బుద్ధివికాసం లేకపోవడం, వృద్ధాప్యంలో మనస్సు బలహీనపడడం వలన దేవుడి జ్ఞానం తెలుసుకునే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. ఆయా కారణాల వల్ల కాలాన్ని వృధా చేయకుండా దీపం (శరీరంలో ఆత్మ చైతన్యం) ఉండగానే దేవుడి జ్ఞానం తెలుసుకొని ఇల్లు చక్కబెట్టుకోమని (కర్మలను కాల్చే జ్ఞానాగ్ని సంపాదించుకోమని) పెద్దల ఉద్ధేశ్యం. ఆత్మ (దేవుడి) చైతన్య శక్తి ద్వారానే శరీరం మనుగడ సాగిస్తుందన్నారు. ఎప్పుడైతే జీవుడిని తీసుకొని శరీరం నుంచి ఆత్మ బయటకు వెళ్తుందో అప్పుడు ఆ శరీరానికి మరణం సంభవిస్తుందన్నారు. శరీరంలోని గుణచక్రంలో జీవుడు ఉండగా, ఆత్మ (దేవుడి) చైతన్య శక్తి నాడీ కేంద్రాలు, గ్రంథీ కేంద్రాల ద్వారా కర్మానుసారం శరీరాన్ని నడుపుతుందన్నారు. అందులోని జీవుడు శరీరం ద్వారా కష్ట, సుఖాలను అనుభవిస్తున్నాడని పేర్కొన్నారు. ఎప్పుడైతే మనిషి ఆత్మజ్ఞానం తెలుసుకుంటాడో అప్పుడు మోక్షం గురించి అవగాహన ఏర్పడుతుందన్నారు. అప్పటి వరకు శరీరాల మార్పు (జన్మలు) తప్పవన్నారు. భవిష్యత్ తరాలు ఎప్పటికైనా అసలైన అర్థాన్ని గ్రహిస్తారనే ఉద్దేశ్యంతో సామెతలు, పొడుపు కథల్లో దేవుడి జ్ఞానాన్ని ఇమిడ్చి పెట్టారన్నారు. పెళ్లి తంతు, కర్మఖాండ వగైరా సాంప్రదాయాలు దేవుడి జ్ఞానాన్ని తెలిపేవేనన్నారు. దేవుడి జ్ఞానం తెలుసుకోవడం చేస్తే భావరహితంగా చేసినట్లు అవుతుందని, అప్పుడు మనకు ఎలాంటి ఫలితం ఉండదన్నారు. దేవుడి జ్ఞానం తెలుసుకోకుండా గుడ్డిగా ఆచరించడం వృధా అన్నారు.

**ఆత్మజ్ఞానమే అసలైన సిరి**

ఆత్మజ్ఞానం తెలుసుకోవడం ద్వారా పరమాత్మ ధనం సంపాదించుకున్నట్లు అవుతుందన్నారు. ప్రపంచ ధనం కరెన్సీ, బంగారం, స్థిరాస్థులు, చరాస్థులతో శరీరమరణం వలన జీవుడికి సంబంధం తెగిపోతుందన్నారు. ప్రపంచ ధనం రావాలన్నా కర్మతోనే సంబంధపడి ఉంటుందన్నారు. గత జన్మల్లో చేసుకున్న పుణ్యం వలన ఈ జన్మలో ప్రపంచ సంపదలతో సుఖపడే అవకాశం ఉంటుందన్నారు. గత జన్మల్లో చేసుకున్న పుణ్యం వలన ప్రస్తుత జన్మలో సినిమా హీరోగా పేరు ప్రఖ్యాతలతో పాటు అన్ని రకాల సుఖాలను (బోగాలను) అనుభవించిన జీవుడు, శరీరమరణంతో తర్వాత జన్మలో బిచ్చగాడిగా జీవనం సాగించాల్సి ఉంటుందన్నారు. కర్మకు సంబంధం లేకుండా ప్రతి వ్యక్తి ఆత్మజ్ఞానం తెలుసుకునే వెసులుబాటు కలిగిఉన్నాడన్నారు. ఒక జన్మలో సంపాదించుకున్న ఆత్మజ్ఞానం తరిగిపోదన్నారు. ఎంత పంచినా పెరుగుతుందే తప్ప తరగదన్నారు. పరమాత్మ ధనం జీవుడు మోక్షం పొందే వరకు జన్మజన్మలకు వెంట వస్తుందన్నారు. ఏ విధంగా చూసినా ప్రపంచ ధనం తాత్కాలికమైనదన్నారు.

**త్రైత సిద్ధాంతం ద్వారానే ఆధ్యాత్మిక జ్ఞానం**

ఆత్మను గురించి అధ్యయనం (తెలుసుకోవడమే) ఆధ్యాత్మికం అని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వివరించాడన్నారు. త్రైత సిద్ధాంతం ద్వారానే ఆధ్యాత్మిక జ్ఞానం తెలుస్తుందన్నారు. మూడు ఆత్మల గురించి తెలుసుకోకుండా ఇతరత్రా ఏ సిద్ధాంతం ద్వారా మోక్షం పొందే అవకాశం లేదన్నారు.

**అధర్మ ఆచరణలతో దేవుడి పాలకుల చేతిలో శిక్షలు**

ఆత్మ (దేవుడి) జ్ఞానం తెలుసుకోవాలనే శ్రద్ధ లేకుండా ప్రపంచ విషయాల్లో మునిగితేలుతూ అధర్మాలను ఆచరించడం వలన చాలా మంది దేవుడి పాలకుల చేతిలో శిక్షలకు గురవుతున్నారన్నారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు జ్ఞాన బోధల్లో ఆయా విషయాలను వెల్లడించాడన్నారు. సృష్టికర్త అయిన దేవుడిని విస్మరించి దేవతలను ఆరాధించేవారు, దేవాలాయాల సందర్శనకు వెళ్లివచ్చేవారు, పుట్టిన రోజు వేడుకలు, భావరహితంగా పెళ్లి వేడుకలు చేసుకునేవారు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు.

**కుల, మతాలకు అతీతంగా భగవద్గీత, బైబిల్, ఖుర్ఆన్ చదవాలి**

ప్రతి ఒక్కరూ కుల, మతాల బేధం లేకుండా త్రైత సిద్ధాంతం ఆధారంగా ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన భగవద్గీత, బైబిల్, ఖుర్ఆన్ గ్రంథాలు చదివి ఆత్మ జ్ఞానం తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఇంటింటికి తిరిగి గ్రంథాల ప్రచారం**

దేవుడి సేవలో భాగంగా ఇంటింటికి తిరిగి త్రైత సిద్ధాంత గ్రంథాలను పరిచయం చేశారు. ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత గ్రంథాలు చదవాలని కోరారు. ప్రచారంలో కోదాడ కమిటీ అధ్యక్షుడు పోటు వెంకటేశ్వర్లు, సభ్యులు వంగాల మహేష్, జాస్తి శివరామకృష్ణ, ముత్తవరపు శైలజ, బుద్దా వీరన్న, చల్లా నర్సింహారావు పాల్గొన్నారు.

# విద్యార్థినికి ఆత్మీయ సన్మానం



కోదాడ టౌన్, మేజర్‌న్యూస్ : 18వ వార్డు విద్యార్థిని యలమర్తి ప్రహర్షిణి ఇంటర్ మొదటి సంవత్సరం 470 మార్కులకు గాను 466 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలవడం పట్ల వార్డు ప్రజలు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. పెదనాటి నరసింహారావు, కనగాల రాధాకృష్ణ, మాతంగి ప్రభాకర్ రావు, మస్తాన్, దాస్, శ్రీనివాస్ రెడ్డి, రామకోటేశ్వరరావు, గురునాథం, విన్సెంట్, పొట్లూరి ప్రసాద్, నరేష్, హరిబాబు, హనుమంతరావు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగం పై రైతులకు సూచనలు

## కౌలురైతు సంఘం రాష్ట్రకార్యదర్శి అన్నెం పాపిరెడ్డి



కోదాడ రూరల్, మేజర్‌న్యూస్ : విద్యుత్ వినియోగంపై కౌలురైతు సంఘం రాష్ట్రకార్యదర్శి అన్నెం పాపిరెడ్డి ఆధ్వర్యంలో రైతులకు సూచనలు ఇచ్చారు. విద్యుత్ అవసరం తీరిపోయిన తర్వాత ట్రాన్స్ ఫార్మర్లను తప్పకుండా ఆఫ్ చేయాలన్నారు. ఈదురుగాలుల వలన విద్యుత్ స్తంభాలు కూలే ప్రమాదం ఉందన్నారు. మూగ జీవాలు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు భూక్యా సక్రు, బాలు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా హోలీ బైబిల్ స్కూల్ ముగింపు వేడుకలు









కోదాడ టౌన్, మేజర్ న్యూస్ : నయా నగర్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హోలీ బైబిల్ స్కూల్ ముగింపు వేడుకలు పాస్టర్ రెవరెండ్ ఏసయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బైబిల్ స్టోరీ, బైబిల్ గేమ్స్, పప్పెట్ షోస్ మొదలగు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జయకర్ పవిత్ర రాణి, క్రిస్టియన్ కో ఆప్షన్ సభ్యురాలు జానకి ఏసయ్య, ద్రాక్షవల్లి, కోటయ్య, జాన్ విజయానంద్, మేరమ్మ, భాగ్యశ్రీ, నరేంద్ర, రమ్య పాల్గొన్నారు.

# వికలాంగులకు వీల్ చైర్ల పంపిణీ





కోదాడ, మేజర్‌న్యూస్ : అంబేద్కర్ కాలనీ కవనెంట్ చర్చిలో ఐసీఎం ఆధ్వర్యంలో 16 మంది వికలాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. ఐసీఎం ప్రెసిడెంట్ జెస్సీ పాల్, జిల్లా కో ఆర్డినేటర్ అబ్రహం అల్లూరి, జి సాల్మన్, మోహనకృష్ణ, టి వెంకటేశ్వరరావు, డి విజయ్, పాస్టర్లు శ్రీనివాసాచారి, సమూయేలు పాల్గొన్నారు.

# దేశ సంపదను అమ్ముకుంటున్న బీజేపీని ఓడించండి

**- దేశాన్ని నిర్మించిన కాంగ్రెస్‌ను గెలిపించండి - ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. నాగన్న గౌడ్ విజ్ఞప్తి**



హిమాయత్ నగర్ , మేజర్ న్యూస్ :రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, బడా కార్పొరేట్లకు దేశ సంపదను హోల్‌సేల్ గా అమ్ముకుంటున్న బీజేపీ ను ఈ లోక్ సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి, దేశాన్ని నిర్మించిన కాంగ్రెస్ ను గెలిపించాలని ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. నాగన్న గౌడ్ పిలుపునిచ్చారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతరేక విధానాలకు పాల్పడుతున్న నిరంకుశ మోదీ ప్రభుత్వాన్ని ప్రజలు తమ ఓటు ద్వారా ఓడించి తరిమికొట్టాలని అయన విజ్ఞప్తి చేశారు. నారాయణగూడ లోని ఐ.ఎన్.టి.యు.సి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. డి. చంద్ర శేఖర్, ఉపాధ్యక్షులు ఎంబి. విజయ్ కుమార్, కార్యదర్శులు ఎస్. నరసింహ రెడ్డి, గోదా మల్లేష్ గౌడ్ తదితరులతో కలసి వై. నాగన్న గౌడ్ మాట్లాడారు. కేంద్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పాటు చేసి లక్షలాదిమంది పౌరులకు ఉద్యోగావకాశాలు కల్పించాయని, ఇప్పటికి లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి ఉద్యోగావకాశాలు లేకుండా చేసిందని మండిపడ్డారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ తెలంగాణ ప్రజలకు నిలువునా మోసం చేసిందని, కార్మికులకు, రైతులకు, మహిళా, విద్యార్థి, యువతకు చేసిందేమీలేదని, కేవలం అవినీతికి పాల్పడడం తప్ప అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత ఐ.ఎన్.టి.యు.సి సలహా మేరకు ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం ఫిట్మెంట్ తోపాటు ఫిక్స్డ్ డిపాజిట్ విడుదల సౌకర్యం మరియు ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ. 12 వేలు ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కల్పించారని గుర్తు చేశారు. ఉపాధి హామీ పథకంను పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తామని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టో లో ప్రకటించిందని అన్నారు. సంఘటిత, అసంఘటిత, వ్యవసాయ, స్కీం, రవాణారంగా, అంగన్వాడీ, ఐకెపి, భావన నిర్మాణ మరియు ప్రైవేట్ సెక్టార్ లలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు జి. సంజీవ్ రెడ్డి నేతృత్వ బృందం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కలసి విజ్ఞప్తి చేసిందని, దీనిపై అయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. నమోదు చేసుకున్న 17 లక్షలమంది భవననిర్మాణ కార్మికులు, 20 లక్షలమంది రవాణా కార్మికుల సంక్షేమ కార్యక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో నిధులు మంజురుకు శ్రీకారంచుడుతుందని అయన వెల్లడించారు. సంజీవ్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం నుండి ఇటీవలే 90 లక్షలమంది ఐ.ఎన్.టి.యు.సి సభ్యత్వం కేంద్ర కార్మిక మంత్రుత్వ శాఖకు అందజేశామని చెప్పారు. ఐ.ఎన్.టి.యు.సి అనుబంధ కార్మిక సంఘాలు, ప్రభుత్వరంగ సంస్థల కార్మికులు, అసంఘటిత కార్మికులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలువు కోసం కృషి చేయాలనీ వై. నాగన్న గౌడ్ విజ్ఞప్తి చేసారు. ఆర్. డి. చంద్ర శేఖర్ మాట్లాడుతూ ... 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ మినిమం వేజెస్ కొత్త జిఓ ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చి అమలు చేయాలనీ, అలాగే ప్రైవేట్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లను అందజేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డినీ కోరారు. కేంద్ర నూతన మోటార్ వాహన చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయవద్దని అన్నారు. కార్మికుల హక్కులను, ప్రభుత్వరంగ సంస్థలను రక్షించుకోవడానికి కార్మికవర్గమంతా ఏకమై కాంగ్రెస్ పార్టీ ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు జి. సంజీవ్ రెడ్డి సూచనా మేరకు ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ శాఖ కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతిస్తూ రాష్ట్రంలో అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలువు కోసం ఐ.ఎన్.టి.యు.సి శ్రేణులు పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారని ఆర్. డి. చంద్ర శేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర నేతలు ఏం. రమేష్ గౌడ్, ఏం. రాజేందర్ రెడ్డి, కె. ఉపేందర్, బి. రామకృష్ణ రెడ్డి, శంకర్ నాయక్, డి. మహేష్, సిఎండెర్ రెడ్డి, బి. వీరన్న, దేవేందర్ పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించాలి

**- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ - ఎన్నికలలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైనది - జనరల్ అబ్జర్వర్ శ్రీవిద్య**



హైదరాబాద్, మేజర్ న్యూస్ ( సిటీ ప్రతినిధి):ఎన్నికలలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలన జరపాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. పోలింగ్ సరళిని సూక్ష్మ స్థాయిలో పరిశీలన చేయుటకు నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు సోమవారం బంజారాహిల్స్ లోని కొమరం భీమ్ ఆదివాసి భవన్ లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించ గల్గుతారన్నారు. ముఖ్యంగా పోలింగ్ కు ముందు రోజు ఉదయం నిర్ణీత సమయంలోగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు చేరుకొని పోలింగ్ సిబ్బందికి అందించే సామాగ్రి సక్రమంగా అందినదా లేదా అన్నది పరిశీలించాలని, అనంతరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ స్టేషన్లకు చేరుకోవాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్ల పాత్ర ప్రతి దశలో నిర్ణయాత్మకంగా ఉంటుందని, నిబంధనలకు అనుగుణంగా మాక్ పోలింగ్ జరగాలని,పోలింగ్ రోజు ఏజెంట్ల సమక్షంలో ఉదయం 5.30 గంటలకే మాక్ పోల్ ప్రక్రియ జరిగేలా చూడాలని, ఒకవేళ ఏజెంట్లు ఎవరూ హాజరు కాని పక్షంలో 15 నిమిషాలు వేచి చుసిన మీదట మైక్రో అబ్జర్వర్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మాక్ పోల్, తదనంతరం చేపట్టే పోలింగ్ ప్రక్రియలు నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరుగుతున్నాయా లేదా అన్నది నిశిత పరిశీలన చేయాలని, ఉదయం పోలింగ్ ప్రారంభం నుండి సాయంత్రం పోలింగ్ పూర్తయి సీల్ అయ్యేంతవరకు జరిగిన వివరాల నివేదికను జనరల్ అబ్జర్వర్ కు అందించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలూ ఉన్నాయా లేవా అన్నది, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్మెంట్ సరిగానే ఏర్పాటు చేశారా అన్నది పరిశీలించాలన్నారు. ఎక్కడైనా సాంకేతిక లోపాల వల్ల ఈ.వీ.ఎం లు పనిచేయకపోతే, వాటి స్థానంలో వేరే ఈ.వీ.ఎం లను ఎలా అమరుస్తున్నారు అన్నది పరిశీలన చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర అధికారులు నిర్వర్తిసున్న విధులను గమనించాలన్నారు.పోలింగ్ ప్రారంభమైనప్పటి నుండి పూర్తయ్యేంత వరకు అన్ని అంశాలను గమనిస్తూ, ఎప్పటికప్పుడు జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని, ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైకో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఉదయం 7.00 గంటలకు పోలింగ్ ప్రారంభమై, సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతుందన్నారు. సమస్యాత్మక కేంద్రాలలో మరింత ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, పోలింగ్ కేంద్రం బయట, పరిసర ప్రాంతాల్లోనూ జరిగే అంశాలను గమనిస్తూ జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు.పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలకు సంబందించిన అంశాలను ఆయన వివరించారు. పూర్తి అవగాహనతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జనరల్ అబ్జర్వర్ పి.ఐ. శ్రీవిద్య మాట్లాడుతూ,ఎన్నికలలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైనదని అన్నారు. ఈ సందర్భంగా ఆమెమైక్రో అబ్జర్వర్లకు పలు సూచనలు చేశారు.మైక్రో అబ్జర్వర్ ల విధులు బాధ్యతతో కూడుకున్నవని,మైకో అబ్జర్వర్లు కళ్ళు, చెవుల లాంటి వారని పోలింగ్ కేంద్రాలలో ప్రతి అంశాన్ని పరిశీలించాలని, పోలింగ్ ప్రారంభం నుండి ముగింపు వరకు ఎలాంటి సంఘటనలు జరిగినా, తమ నోటీసుకి తీసుకురావాలని తెలిపారు. ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైక్రో అబ్జర్వర్లు పనిచేయాలని సూచించారు.ఏలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. స్వేచ్ఛగా, ఎన్నికలు నిర్వహించాలన్నారు.ముఖ్యంగా పోలింగ్ కేంద్రాలలో కనీస మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలని, మైక్రో అబ్జర్వర్లు ప్రతి రిపోర్టును నేరుగా జనరల్ అబ్జర్వర్ కు ఇవ్వాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ ప్రక్రియ జరగాలన్నారు.సీసీ కెమెరా ఓటింగ్ కంపార్ట్మెంట్ వైపు ఉండకూడదని, ఆయా విషయాలన్నింటిని సూక్ష్మంగా పరిశీలించాలని తెలిపారు.అనంతరం ఈవీఎం, వీవీ ప్యాట్ ల నిర్వహణ పైమైక్రో అబ్జర్వర్లకు హాండ్స్ ఆన్ శిక్షణ నిచ్చారు.శిక్షణ తరగతుల్లో మైక్రో అబ్జర్వర్లు,జిల్లా ఎన్నికల ట్రైనింగ్ నోడల్ అధికారి అడిషనల్ కమిషనర్ (యు బి డి)సునంద,ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

**వివి ప్యాట్లలో సింబల్ లోడింగ్‌ను**

# త్వరగా పూర్తి చేయాలి

**రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి**



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్‌ఃహైదరాబాద్ పార్లమెంట్ నియోజవర్గం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల సింబల్‌ను వివి ప్యాట్‌లలో ఆదివారం రాత్రిలోగా లోడింగ్‌ను పూర్తి చేయాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టరు అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్ పార్లమెంటరి నియోజకవర్గంలోని చంద్రాయణ్‌గుట్ట, గోషామహల్, చార్మినార్, యాకుత్‌పురా,కార్వాన్,బహదూర్‌పురా, మలక్‌పేట్ నియోజకవర్గాల డి.ఆర్.సి. సెంటర్లను ఆయన సందర్శించి, అక్కడ ఉన్న వివి ప్యాట్‌లలో అభ్యర్థుల గుర్తుల లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివి ప్యాట్‌లలో సింబల్ లోడింగ్ ప్రక్రియను ఆదివారం రాత్రి లోగా పూర్తి చేయాలని,అసెంబ్లీ సెగ్మెంట్లలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ.వి.ఎం.లను సెగ్రిగేషన్ పూర్తి చేయాలని ఆయన సూచించారు. డి.ఆర్.సి. కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి తాగునీరు,మజ్జిగను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్.ఓ.లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నివేదిత సాయన్న గెలుపు ఖాయం

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



కాప్రా, మేజర్ న్యూస్...కంటోన్మెంట్ భారత రాష్ట్ర సమితి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిక సాయన్న గెలువు ఖాయం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం తిరుమల గిరి లోని చిన్న కమేల లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు గ్యారంటీలను అమలుకు నోచుకోలేదని కాలయాపన చేస్తూ సమయం గడుపుతున్నారని, గత ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిగా నిలిపివేయబడ్డాయని గుర్తు చేశారు. కంటోన్మెంట్ లో మరో సారి గులాబీ జెండా ఎగరడం పక్క అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు శ్రీనివాస్ రెడ్డి , పార్టీ నాయకులు సాయి జెన్ శేఖర్ ,ఆకుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల గడ్డపై మూడోసారి హ్యాట్రిక్‌గా బిఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

## ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



కూకట్ పల్లి మేజర్ న్యూస్ :రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలువు మద్దతుకై ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 1 కాలనీ వాసుల తో జరిగిన ఆత్మీయ సమావేశంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ ఫేస్ 1 కాలనీ వాసులు చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గారికి పూర్తి మద్దతు తెలియచేయడం చాలా గొప్ప విషయం అని అన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బిఆర్ఎస్ పార్టీ గెలుస్తూ వస్తుందని, ఈ సారి కూడా పార్టీ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్ కి కానుకగా ఇస్తామన్నారు.పార్టీ రెండు సార్లు అవకాశం ఇచ్చిన ఇద్దరు నేతలు ఇప్పుడు ఇతర పార్టీల నుండి పోటీ చేస్తున్నారని ఆ ఇద్దరిని ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుండి వ్యతిరేకత ఎదుర్కొంటుందని అన్నారు.కేసీఆర్ ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలను ఏ ఒక్క గ్యారెంటీ అమలు చేయలేదని ప్రజలకు వివరిస్తూ, మోసం చేసే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయొద్దని అన్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటూ, కాపాడుకుంటూ వచ్చిన పార్టీ మన బీఆర్ఎస్ పార్టీ అని ఎమ్మెల్యే గాంధీ తెలియచేశారు.బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిత్యవసర సరుకులు, గ్యాస్ ధరలను పెంచి సామాన్యుల బ్రతుకులపై గుది బండగా మారిందని, మత రాజకీయాలు చేసి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం తప్పా ఈ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదు అని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ అత్యధిక భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయం అని ఈ విజయం ను తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కానుకగా ఇస్తామని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డ్ మెంబర్లు, ఏరియా కమిటీ మెంబర్లు, బస్తి కమిటీ మెంబర్లు, ఉద్యమకారులు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ , బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు కలగకుండా బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి : చైర్మన్ సోమ సురేష్



ఎల్ బి నగర్, మేజర్ న్యూస్ ;ఆర్కే పురం లోని అష్టలక్ష్మి దేవాలయం 28 వ బ్రహ్మోత్సవాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అష్టలక్ష్మి దేవాలయ చైర్మన్ సోమ సురేష్ అన్నారు. సోమవారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఈ నెల9 వ తేది నుండి 15 తేది వరకు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా, తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే విధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం దాదావు బ్రహ్మోత్సవాల సమయంలో లక్ష మంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారని, ఈ బ్రహ్మోత్సవాలకు లక్షకు పైగా భక్తులు వస్తారని అంచనా వేసినట్లు తెలిపారు. సౌకర్యాల విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకున్నామని, అన్న ప్రసాదం, మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదావు 350 మంది వాలంటీర్లు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మాడవీధులలో కళాకారుల మధ్య వాహన సేవలు ఉంటాయని అన్నారు. పదవ తేదీన గరుడ ప్రసాదము ఇవ్వడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, వైస్ చైర్మన్ నాగమల శ్రవణ్ కుమార్, మాజీ చైర్మన్ మేడం సుధాకర్ గుప్త, బ్రహ్మోత్సవ కన్వీనర్ బొగరవు రవీందర్, కమిటీ సభ్యులు చిలుక ఉపేందర్ రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్,గౌరిశెట్టి అరుణ్ కుమార్ తదితరలు పాల్గొన్నారు.

# గీతం సంస్కృతిని సుసంపన్నం చేయండి

## ఏస్ అవార్డుల ప్రదానోత్సవంలో క్యాంపస్ లైఫ్ డీన్ బాల్ కుమార్ పిలుపు




హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి: గీతం హైదరాబాద్ ప్రాంగణ సంస్కృతిని సుసంపన్నం చేయడంలో విద్యార్థులు, విద్యార్థి బృందాల సభ్యుల విశిష్ట సహకారాన్ని గీతం క్యాంపస్ బెస్ట్ డీన్ డాక్టర్ బాల్ కుమార్ గురునాథ్ మూర్తి బహుదా ప్రశంసించారు. ఆ దిశగా మిగిలిన విద్యార్థులు కూడా సాగాలని పిలుపునిచ్చారు. పాఠ్యేతర కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని, విశేష సేవలు అందించిన విద్యార్థులు, విద్యార్థి బృందాలను గీతమ్ లోని డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లెఫ్ట్ సోమవారం 'ఏస్. అవార్డులు – 2024'లతో సత్కరించింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బాల్ కుమార్ స్టూడెంట్ లెఫ్ట్ డైరెక్టర్ డాక్టర్ రీమా చౌదరితో కలిసి ఏస్ ఆకార్డులను ప్రధానం చేశారు. వివిధ ఆవార్డు కేటగిరీలలో దాదావు 800 పెగా దరఖాస్తులు తమకు అందాయని, అందులో అత్యుత్తమమైన వాటిని ఎంపికచేసి సత్కరిస్తున్నట్లు వారు తెలియజేశారు. పాఠ్యేతర కార్యకలాపాల పరివర్తన ప్రభావాన్ని ఈ సందర్భంగా వారు నొక్కి చెప్పారు. ఈ ఆవార్డు కోసం నామినేట్ అయిన వారిని, అవార్డు గ్రహీతలను వారు అభినందించారు. ఈ వేడుకలో కళాకృతికి అత్యంత చురుకైన విద్యార్థి క్లబ్, బెస్ట్ మార్కెటింగ్ అండ్ సోషల్ మీడియా క్యాంపెయిన్, ఈ యేటి అత్యుత్తము స్టూడెంట్ లైఫ్ క్లబ్ అవార్డులను ఇచ్చి సత్కరించారు. అలాగే కోగన్ కి బెస్ట్ ఎగ్జిక్యూటివ్ బోర్డు, పయనీర్స్ క్లబ్ కు డాక్యుమెంటేషన్లో ఎక్సలెన్స్ అవార్డు, ప్రీతిక శివకుమార్ కు ఆల్ రౌండర్ ఆఫ్ ది ఇయర్, ఆదిత్య వర్ధన రావ్ కు అత్యుత్తము అచీవర్ ఆఫ్ ది ఇయర్, గీతం మోడల్ యునైటెడ్ నేషన్స్ (జీఎంయూఎన్)కు అత్యంత ఇష్టమైన స్టూడెంట్ లెఫ్ట్ అవార్డు, ఇలా పలు కేటగిరీలలో ఆవార్డులు ఇచ్చి సత్కరించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులందరినీ అలరించాయి. గీతం ప్రాంగణంలో నిర్వహించిన వివిధ కార్యకలాపాల సమాహారంగా ఓ వీడియోను ప్రదర్శించారు. తొలుత, డైరెక్టరే ట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ అసిస్టెంట్ డైరెక్టర్ జియో సిరిల్ పొడిపర వార్షిక నివేదికను సమర్పించగా, చివరగా సీనియర్ మేనేజర్ సియాలి బసు వందన సమర్పణ చేశారు.రాహుల్ మండల్, వికాస్ సమన్వయంతో సాగిన ఏస్ ఆవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం అంతా చప్పట్లతో మార్మోగి






, అవార్డ్ గ్రహీతలను ప్రశంసించి, మరింత ప్రోత్సహించేలా సాగింది. ఏస్ అవార్డులు గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని విద్యార్థుల అసాధారణ ప్రతిభ, అంకితభావాన్ని ఎత్తి చూసేలా, చక్కటి వ్యక్తులను రూపొందించడంలో పాట్యే తర కార్యకలాపాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పేలా సాగింది.

# ఆటో డ్రైవర్లను మోసం చేసిన కాంగ్రెస్ : కొండా





హైదరాబాద్, మేజర్ న్యూస్ : రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మోసం చేసిందని, వారి బతుకులను రోడ్డు పాలు చేసిందని ఆరోపించారు చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి. సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ లోని వైఎన్ఆర్ గార్డెన్స్ లో భారతీయ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆటో డ్రైవర్లు, లైట్ వెయిట్ మోటార్ వెహికల్ డ్రైవర్లతో ఆయన సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల కోసం ప్రతినెల జీవన భృతి కల్పిస్తామని చెప్పి మాట తప్పిందని ఆరోపించారు. ఆటో డ్రైవర్లను రోడ్డు పాలు చేసిన కాంగ్రెస్ పార్టీకి సార్వత్రిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. తాను చేవెళ్లలో ఎంపీగా విజయం సాధించడం, దేశంలో మూడోసారి భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రి కావడం తథ్యమని అన్నారు. చేవెళ్లలో కానీ ఎంపీగా గెలవగానే ఆటో డ్రైవర్లకు స్వయంగా ఆటోలు కొనుక్కోవడానికి లోన్లు కల్పించడంతోపాటు అర్హులందరికీ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా సొంత ఇంటికి పంపిస్తానని కొండా విశ్వేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం స్కాములతో నిండిపోయిందని ఆ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ బిజెపిని ఎదుర్కోలేక కేరళకు పారిపోయాడని కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు.ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన భారతీయ మజ్దూర్ యూనియన్ ముఖ్య నాయకులు, సభ్యులు, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేసవిలో క్యాన్సర్ రోగులు జాగ్రత్తగా ఉండాలి

**కిమ్స్ హాస్పిటల్ , సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కృప బజాజ్**




హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : మండుతున్న ఎండల నేపథ్యంలో కీమోథెరపీ, రేడియో థెరపీ తీసుకుంటున్న క్యాన్సర్ రోగులు తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని కిమ్స్ హాస్పిటల్, సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కృపా బజాజ్ పేర్కొన్నారు. ఈ చికిత్సల వలన రోగులలో వాంతులు, విరోచనాలు ,ఆహారం నీరుసరిగా తీసుకోలేకపోవడం వంటి దుష్ప్రభావాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ఎండల వలన శరీరంలో నీరు తగ్గడంతో లవణాలను కోల్పోయే అవకాశం ఎక్కువనీ, ఈ విధానం వృద్ధుల్లో ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ ప్రభావం కిడ్నీలపై పడి అవి పాడయ్యే అవకాశం ఉందన్నారు. కనుక నీరు, లవణాలు తగ్గకుండా తగిన మోతాదులో కొబ్బరినీరు, నీరు ,మజ్జిగలో ఉప్పు వేసుకొని తాగాలని సూచించారు. ఘనపదార్థాలు తీసుకోలేని పక్షంలో ద్రవ రూపంలో ఉన్న పదార్థాలను ఎక్కువసార్లు తీసుకోవాలి. ఇలా చేస్తే శరీరంలోని నీరు, లవణాల శాతం తగ్గకుండా జాగ్రత్త పడవచ్చున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతున్న నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నీడపట్టున ఉండటం చాలా ముఖ్యం. ఇదే నెలలో మదర్స్ డే కూడా ఉన్న నేపథ్యంలో... మహిళలు తమ కోసం, తమ కుటుంబం కోసం సంవత్సరంలో ఒకసారి రొమ్ము ,పొట్ట, గర్భాశయం స్కానింగ్, నెలలో ఒకసారి క్యాన్సర్ కారక రక్త పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. 40 ఏళ్లు దాటిన మహిళలు ఈ జాగ్రత్తలు తీసుకుంటే రాబోవు క్యాన్సర్ విపత్తును ముందుగానే పసిగట్ట వచ్చునన్నారు. మహిళలు తమ ఆరోగ్యము కొరకు కొంత సమయం వెచ్చించుకోవాలని కోరారు. రొమ్ములను మహిళలు క్రమబద్ధంగా టెస్ట్ చేయించుకుంటే ఏమైనా గడ్డలు వచ్చే అవకాశం ఉంటే ముందుగానే తెలిసిపోతుందని అన్నారు. దీంతో డాక్టర్ను కలిసి ముందుగానే వారిచ్చే సూచనలతో క్యాన్సర్ ను ఎదుర్కోవచ్చును అన్నారు. కొత్తగా పొట్ట నొప్పి ఉబ్బరంగా ఉన్న డాక్టర్ని సంప్రదించడం మరిచిపోవద్దని హితవు చెప్పారు.

